# ఎవుసమే తెలియదు.. గ్యారెంటీలా..?

- రైతులు 10హెచ్‌పీ మోటార్లు పెట్టుకోవాలా..
- మూడు గంటల కరెంటుతో పంటలు పండించాలా
- తెలంగాణ రాష్ట్రం అవసరం లేదట
- అవగాహనలేని వారికి పార్టీ పగ్గాలు
- ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి
- ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి
- భూపాలపల్లి మండలంలో ఎన్నికల ప్రచారం



కమలాపూర్‌లో మాట్లాడుతున్న భూపాలపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి

జయశంకర్ భూపాలపల్లి, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ) : ఎవుసమే తెలియని కాంగ్రెస్ నాయకులు గ్యారెంటీల పేరుతో ప్రజల్లోకెళ్లడం విడ్డూరంగా ఉందని భూపాలపల్లి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం భూపాలపల్లి మండలం కమలాపూర్, ఆముదాలపల్లి, రాంపూర్, గొల్లబుద్దారం, దూదేకులపల్లి, దీక్షకుంట, పంబాపూర్, నందిగామ, ఆజంనగర్, నాగారం గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి గండ్రకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలనుద్ధేశించి మాట్లాడారు. కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల కరెంటు చాలని, 10హెచ్‌పీ మోటరు పెట్టుకుంటే గంటకు ఎకరం భూమి పారకం చేయొచ్చని వ్యవసాయంపై అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చే మూడు గంటల కరెంటు కోసం రైతులు 10హెచ్‌పీ మోటర్లను కొనుక్కోవాలా అని ప్రశ్నించారు. ప్రస్తుతం రైతుల వద్ద ఉన్న మోటర్లతో మూడు గంటల కరెంటుకు ఎకరం కూడా పారదన్నారు. వ్యవసాయంపై ఏ మాత్రం అవగాహన లేని రేవంత్‌రెడ్డి టీ పీసీసీ చీఫ్‌గా కొనసాగడం బాధాకరమన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రం సైతం అవసరం లేదని, సమైక్య పాలనలోనే అభివృద్ధి జరిగిందని చెప్పుతూ తను సమైక్యవాది అని నిరూపించుకున్నారన్నారు. ఆరు హామీలపై జనం మండిపడుతున్నారని, కర్ణాటకలో కరెంటు కష్టాలపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం దేశానికే దిక్సూచి అన్నారు. 75 సంవత్సరాల ప్రజాస్వామ్యంలో ఏ సీఎం చేయలేని పనులను కేసీఆర్ చేసి చూపించారన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదన్నారు. ప్రచారంలో నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి బస్వరాజు సారయ్య, జడ్పీ వైస్ చైర్మన్ కళ్లెపు శోభా రఘుపతిరావు, ఎంపీపీ మందల లావణ్య, పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్ యాదవ్, మండల యూత్ అధ్యక్షుడు పాలకుర్తి రఘుపతి గౌడ్, నాయకులు ముద్దమల్ల భార్గవ్, భీముని శరత్, పింగిళి రవీందర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


# బీఆర్ఎస్‌కే మా మద్దతు

**కాటారంలో ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్**

కాటారం, నవంబర్ 14 : బీఆర్ఎస్ పాలనలో గడిచిన పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం అద్భుతమైన ప్రగతి సాధించిందని, ఆ పార్టీకే తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఓయూ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం శ్రీరామ్ అన్నారు. మండలకేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పాలన అభివృద్ధి దిశగా వెళ్తున్నదని తెలిపారు. ఆ అభివృద్ధి నిరంతర ప్రక్రియగా కొనసాగాలంటే మళ్లీ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడాలని భావిస్తున్నట్లు చెప్పారు. అందుకే తమవంతు బాధ్యతగా రాష్ట్రమంతా పర్యటిస్తూ ప్రజల్లో అవగాహన తీసుకవచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా మంథని నియోజకవర్గంలో జరిగే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధుకు కూడా తమ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. మేధావులు, విద్యార్థులు, కర్షకులు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో జేఏసీ నాయకులు సంతోష్, ఓంకార్, శాంత కుమార్, శివ, శేఖర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరామ్



రుద్రారం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు

# ఒక్క అవకాశం అనడం సిగ్గుచేటు

- ఏండ్ల తరబడి అధికారంలో ఉండి ఏం చేసిండు
- ఆరు పథకాలు తప్ప ఒక్క సాయం చేస్తనని ఎమ్మెల్యే చెప్తలేడు
- మంథని ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు.. మల్హర్ మండలంలో ప్రచారం

మల్హర్, నవంబర్ 14 : ఏండ్ల తరబడి దేశం, రాష్ట్రంలో ఏలిన కాంగ్రెసోళ్లు ఏమీ చేయకుండా మళ్లీ ఈ ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వమనడం సిగ్గు చేటని బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధూకర్ ఎద్దేవా చేశారు. మంగళవారం మండలంలోని అన్‌సాన్‌పల్లి, నాచా రం, మల్లంపల్లి, రుద్రారం, సుభాష్ నగర్, ఎడ్లపల్లి, కొండంపేట, ఇప్పలపల్లి, శాలపల్లి, వల్లెంకుంట గ్రామాల్లో భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేశ్‌తో కలిసి మధు ప్రచారం చేశారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టో, తన సొంత మ్యానిఫెస్టోను వివరిస్తూ ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ నాడు అధికారంలో ఉండి ఏమీ చేయనోళ్లు మళ్లీ అధికారం కోసం ఆరాటపడుతున్నారన్నారు. ఓట్ల కోసం ఆరు అబద్దాల పథకాలను చెప్తున్న ఎమ్మెల్యే ఈ ప్రాంత ప్రజలకు తనవంతుగా ఏం చేస్తడో చెప్పడంలేదని విమర్శించారు. ఐదేండ్లు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే మా ప్రభుత్వం లేదని, నా దగ్గర ఏమీ లేవని చెప్పిన ఆయన మళ్లీ అధికారం ఇస్తే గవే మాటలు చెప్తడన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నాలుగేండ్లలో అనేక అభివృద్ధి పనులు చేశానని, సంక్షేమ పథకాలను మీ గడపకు చేర్చానని మధు గుర్తు చేశారు. అంతేకాకుండా తన తల్లి పేరుతో అనేక సేవా కార్యక్రమాలు చేశానన్నా రు. కాంగ్రెస్ హయాంలో ప్రస్తుత ఎమ్మెల్యే అభ్యర్థి మంత్రిగా ఉన్నా మల్హర్ మండలాన్ని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి అబద్ధపు మాటలతో ప్రజల ను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమం, వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసి 24గంటల కరెంటు ఇస్తుంటే వారు మాత్రం మూడు గంటలు చాలని, అందుకు మోటర్ల పనితీరుతో లెక్కలు వేస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రవేశపెట్టే ప్రతి పథకానికి గ్యారెంటీ ఉంటుందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోరే తనను ఆదరించి, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు కర్రు నాగయ్య, మాదాటి శ్రీనివాస్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల అధ్యక్షుడు గోనె శ్రీనివాస్‌రావు, సింగిల్ విండో చైర్మన్ చేప్యాల రామారావు, మంథని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పుట్టపాక శ్రీనివాస్, సర్పంచులు కాసాగాని రామయ్య, పాగాడాల నారాయణ, ధనలక్ష్మి, అడ్డూరి కుమారస్వామి, సిద్ది లింగమూర్తి, శనిగరపు రమేశ్ పాల్గొన్నారు.

# గిరిజన దొరసాని సీతక్క

- నేను పోటీలో ఉంటే ఇంత అక్కసా..?
- ఛత్తీస్‌గఢ్‌లో వేల కోట్లు దోచుకొని 30 నియోజకవర్గాల్లో డబ్బులు పంపిణీ
- ప్రజల ఆదరాభిమానాలే గెలిపిస్తాయి
- ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి నాగజ్యోతి
- ములుగులో ముమ్మర ప్రచారం



జగ్గన్నపేటలో మాట్లాడుతున్న ములుగు ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి

ములుగురూరల్, నవంబర్14 : ములుగు ఎమ్మెల్యే సీతక్క నిజమైన ఆదివాసీ బిడ్డ కాదని, ఆమె గిరిజన దొరసానిగా మారిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బడే నాగజ్యోతి అన్నారు. మంగళవారం మండల ఎన్నికల ఇన్‌చార్జి, రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డితో కలిసి నాగజ్యోతి చింతలపల్లి, పొట్లాపూర్, పత్తిపల్లి, చింతకుంట, కొడిశలకుంట, చిన్న గుంటూరుపల్లి, పులిగుండం, జగ్గన్నపేట, సారంగపల్లి, భాగ్యతండా, జీవంతరావుపల్లి, మహారాజ్‌పల్లి, బండారుపల్లి, అన్నంపల్లి, దేవగిరిపట్నం గ్రామాల్లో రాత్రి వరకు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛత్తీస్‌గఢ్‌లో వేల కోట్ల కాంట్రాక్టులు చేసి అక్కడి డబ్బును తెలంగాణలోని 30 నియోజకవర్గాల్లో పంచుతున్నారన్నారు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సీతక్క ములుగు నియోజకవర్గ ప్రజలతో పాటు తన సొంత ఊరికి చేసింది ఏమీలేదన్నారు. కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసేది సీతక్క కాదని, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అన్నారు. విప్లవ కారుడి బిడ్డనైన నాకు సీఎం కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థిగా మంచి అవకాశం ఇవ్వడాన్ని ఓర్వలేక ఢిల్లీ నుంచి తెలంగాణ ద్రోహులతో పాటు ఓటుకు నోటు దొంగ అయిన రేవంత్‌రెడ్డిని పిలిపించుకున్నదన్నారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సత్యవతిరాథోడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డితో పాటు కార్పొరేషన్ చైర్మన్లు తెలంగాణలో పుట్టిన బిడ్డలన్నారు. ఢిల్లీ నాయకులకు గులాములుగా పనిచేస్తు న్న సీతక్కకు వారిని విమర్శించే నైతిక హక్కులేదన్నారు. గిరిజనులు, గిరిజ నేతలకు పోడు పట్టాలు అందే బాధ్యత తాను తీసుకుంటానని నాగజ్యోతి తెలిపారు. సీతక్క తన సొంత గ్రామమైన జగ్గన్నపేటను అభివృద్ధి చేయలేదని, తాను ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం తాను పుట్టి పెరిగిన కన్నెపల్లిలా జగ్గన్నపేటను చూసుకుంటానని నాగజ్యోతి అన్నారు. గ్రామంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అడ్డుగోడలా ఉన్న సీతక్కను ఓడించాలని, నిరుపేద గిరిజన బిడ్డనైన తనను నిండు మనస్సుతో ఆశీర్వదించాలని ప్రజలను కోరారు.

### కాంగ్రెస్‌ను నమ్మొద్దు

**– రెడ్కో చైర్మన్ సతీశ్‌రెడ్డి**

24గంటల కరెంట్ కావాలో.. 3గంటల కరెంట్ కావాలో..? ఇంటింటికీ రూ.5లక్షల బీమా కావాలో.. లేక ఇబ్బందులు పెట్టే కాంగ్రెస్ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని రెడ్కో చైర్మన్, మండల ఎన్నికల ఇన్‌చార్జి సతీశ్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దని, ప్రజల యోగక్షేమాలను చూసే గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ వెంట నడువాలని కోరారు. నాగజ్యోతిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాదం ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు చెన్న విజయ్, పత్తిపల్లి ఎంపీటీసీ నూనావత్ మహేష్‌నాయక్, ఉప సర్పంచ్ వెంగల్ రావు, నాయకులు వేములపల్లి భిక్షపతి, వెల్పూరి సత్యనారాయణరావు, సానికొమ్ము ఆదిరెడ్డి, రమేశ్ రెడ్డి, రఘు, నగేశ్, అజార్, మహేశ్ పాల్గొన్నారు.

**ప్రహ్లాద్‌ది స్వార్థ రాజకీయం :** *చందూలాల్ తనయుడు అజ్మీరా ధరమ్‌సింగ్*

సీఎం కేసీఆర్ తన తండ్రి అజ్మీరా చందూలాల్‌కు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చి గెలిచిన అనంతరం మంత్రి పదవి ఇచ్చాడని మాజీ మంత్రి, దివంగత నేత చందూలాల్ తనయుడు అజ్మీరా ధరమ్‌సింగ్ అన్నారు. తన తండ్రి చనిపోయే వరకు బీఆర్ఎస్ జెండా కింద ఉంటే తన సోదరుడు అజ్మీరా ప్రహ్లాద్ స్వార్థ రాజకీయాల కోసం బీజేపీలో చేరి పార్టీని చీల్చాలని చూస్తున్నాడని అన్నారు. తన తండ్రి అడుగు జాడలో నడిచేందుకు తాను బీఆర్ఎస్‌లోనే ఉండి నాగజ్యోతి గెలుపునకు కృషి చేస్తున్నానన్నారు.